క్లుప్తంగా

అంకమ్మతల్లికి కుంకుమార్చనలు



మధురానగర్(విజయవాడసెంట్రల్): స్థానిక నేతాజీ కాలనీ శ్రీఅంకమ్మతల్లి శక్తిపీఠంలో శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు కుంకుమార్చనలు చేశారు. పీఠం వ్యవస్థాపకుడు అన్నాబత్తుల శరాబందీరావు ఆధ్వర్యాన పూజలు జరిగాయి. భక్తులు పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

శివకామేశ్వరీ పీఠంలో మాస శివరాత్రి పూజలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): అయోధ్యనగర్ శ్రీదత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో శుక్రవారం సాయంత్రం మాస శివరాత్రి పూజలు శ్రీధర్మపరిషత్ మహాసంస్థాన్ ఆధ్వర్యాన ఘనంగా జరిగాయి. ఆలయ అర్చకులు నీలకంఠేశ్వర స్వామికి విశేషంగా మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అన్నాభిషేకం, బిల్వ అర్చనలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామిని దర్శించుకున్నారు. కార్యక్రమాలను పీఠం వ్యవస్థాపకుడు అవ్వా హేమసుందర వరప్రసాద్ పర్యవేక్షించారు.

అర్హులకు రేషన్ కార్డులు




మధురానగర్(విజయవాడసెంట్రల్): అర్హులందరికీ రేషన్ కార్డులు అందజేస్తున్నామని 29వ డివిజన్ కార్పొరేటర్ కొంగితల లక్ష్మీపతి అన్నారు. మధురానగర్ 208వ వార్డు సచివాలయం పరిధిలో కొత్తగా మంజూరైన లబ్ధిదారులకు రేషన్ కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో రేషన్ కార్డుల పంపిణీ ప్రహసనంగా ఉండేదని, వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక అర్హులను గుర్తించి ఇంటివద్దనే వాటిని అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో వార్డు సచివాలయం సిబ్బంది, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుకోవాలి

మధురానగర్(విజయవాడసెంట్రల్): సంస్కృతీ సంప్రదాయాలను పరిరక్షించుకోవాలని నారాయణ పాఠశాల ఏజీఎం మురళీ కిషోర్ సూచించారు. మారుతీనగర్ నారాయణ పాఠశాలలో దసరా ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం చిన్నారులకు దేవీ వేషధారణ పోటీలు జరిగాయి. అనంతరం చిన్నారులు శ్రీదేవి వేషధారణలతో చేసిన విన్యాసాలు చూపరులను ఆకట్టుకున్నాయి. పాఠశాల ప్రిన్సిపాల్ ఫాజిల్ హుస్సేన్ మాట్లాడుతూ మన సంస్కృతి సంప్రదాయాలను భావి తరాలకు తెలిపేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు, తల్లితండ్రులు పాల్గొన్నారు.

అలరించిన భక్తి గీతాలు



విజయవాడ కల్చరల్: దసరా మహోత్సవాల సందర్భంగా గాయనీ గాయకుల ఐక్యవేదిక ఆధ్వర్యాన గాంధీనగర్ హనుమంతరాయ గ్రంథాలయంలో నిర్వహిస్తున్న సినీ సంగీత కార్యక్రమాలు మూడో రోజుకు చేరుకున్నాయి. శుక్రవారం కార్యమాలను పల్లెకొండ ఆర్ట్స్ సంస్థ నిర్వహించింది. గాయకుడు పి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గాయనీ గాయకులు భక్తి గీతాలతోపాటు తెలుగు హిందీ చిత్ర గీతాలను ఆలపించారు. సంస్థ వ్యవస్థాపకుడు శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతి నెలా కార్యక్రమాలను నిర్వహించి నూతన గాయనీ గాయకులకు అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు.

ఇంటి ముంగిటకే వైద్యం

- ఎమ్మెల్యే మల్లాది విష్ణు
- జగనన్న సురక్షతో ప్రజారోగ్యానికి భరోసా



ఆరోగ్య సురక్ష వైద్యశిబిరంలో ఎమ్మెల్యే మల్లాది విష్ణు, డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ

గుణదల(విజయవాడ తూర్పు): ప్రజల ఇంటి ముంగిటకే మెరుగైన వైద్యం అందించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో చారిత్రాత్మకంగా జగనన్న ఆరోగ్య సురక్ష పథకాన్ని అమలు చేశారని సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. గుణదలలోని విజయమేరి ఫంక్షన్ హాల్లో శుక్రవారం మేయర్ రాయన భాగ్యలక్ష్మితో కలిసి ఎమ్మెల్యే విష్ణు జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. అక్కడ ఏర్పాటు చేసిన రిజిస్ట్రేషన్ కౌంటర్, డాక్టర్ కన్సల్టేషన్ గదులు, ల్యాబ్, మందులిచ్చే కౌంటర్లను పరిశీలించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాళ్లను పరిశీలించి మహిళలకు ఇస్తున్న కౌన్సెలింగ్ విధానాన్ని పరిశీలించారు. ఎమ్మెల్యే విష్ణు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష పథకం పేదలకు వరమన్నారు. ఈ సర్వే ద్వారా ఏడు రకాల పరీక్షలు చేస్తున్నట్లు చెప్పారు. డివిజన్‌లోని 1, 3, 238 వార్డు సచివాలయాల పరిధిలోని 3,550 కుటుంబాల్లో 11,193 మందికి(95 శాతం) ఆరోగ్య పరీక్షలు నిర్వహించినట్లు చెప్పారు. వీరికి 7,318 రకాల వైద్య పరీక్షలు చేసి 1,338 టోకెన్లు అందజేసినట్లు చెప్పారు. సాధారణ వ్యాధులకు అక్కడే మందులు ఇస్తున్నట్లు చెప్పారు. చికిత్స అవసరమైన రోగులకు మరిన్ని వైద్య పరీక్షలు చేసి వ్యాధి నయయ్యే వరకు మందులు అందజేస్తున్నట్లు చెప్పారు. వ్యాధి తీవ్రత ఆధారంగా మెరుగైన చికిత్సకు ఆరోగ్య శ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రులకు సిఫార్సు చేస్తారని తెలిపారు. నగరంలో 29 ఆసుపత్రుల్లో సేవలందుతున్నట్లు చెప్పారు. నియోజకవర్గంలో ఇప్పటి వరకు 71,982 కుటుంబాలకు ఆరోగ్య సేవలు అందించినట్లు, వీరి ఆరోగ్యానికి నాలుగేళ్లలో రూ.160 కోట్లను ప్రభుత్వం ఖర్చు చేసిందన్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఆరోగ్యశ్రీ నిధులను చంద్రబాబు దుర్వినియోగం చేసినట్లు గుర్తు చేశారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రస్తుతం గ్రీన్ చానల్ ద్వారా నిధులు పారదర్శకంగా వినియోగిస్తున్నట్లు చెప్పారు. ప్రజా అవసరాల దృష్ట్యా రాత్రి సమయంలోనూ ఆసుపత్రుల వద్ద ముగ్గురు వైద్య సిబ్బందిని నియమించినట్లు వెల్లడించారు. వీరి ఫోన్ నంబర్లను ఆరోగ్య సురక్ష క్యాంపుల వద్ద ప్రదర్శిస్తారని తెలిపారు. హృద్రోగులకు అత్యవసర సమయంలో సేవలందించడానికి జీజీహెచ్‌లో రూ.45వేలు ఖరీదు చేసే స్టెమీ ఇంజక్షన్‌లను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ప్రభుత్వ సేవలను ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎంవోహెచ్ రామకోటేశ్వరరావు, పార్టీ నాయకులు ఉద్దంటి సురేష్, బండి వేణు, మానికొండ సాంబశివరావు, కొంగితల శివ, కంభం కొండలరావు, భోగాది సురేష్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ న్యాయవాదుల తీరు సరికాదు

వైఎస్సార్ సీపీ లీగల్‌సెల్ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు సాయిరామ్



సివిల్ కోర్టు భవనం ఎదుట ఆందోళన చేస్తున్న వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ న్యాయవాదులు

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): చంద్రబాబు మెప్పుకోసం ఆయన తరఫు న్యాయవాదులు కోర్టు మర్యాదలను లెక్కచేయకుండా వ్యవహరించడం సరైన పద్ధతి కాదని, దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ న్యాయవాదులు శుక్రవారం సివిల్ కోర్టు భవనం ఎదుట ఆందోళన చేశారు. వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా లీగల్‌సెల్ అధ్యక్షుడు సాయిరామ్ మాట్లాడుతూ ఏసీబీ కోర్టులో చంద్రబాబు తరఫున న్యాయవాదులు ప్రభుత్వ న్యాయవాదులపై అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. కర్తవ్యంలో భాగంగా సీఐడీ తరఫున వాదనలు వినిపిస్తున్న ప్రభుత్వ న్యాయవాది వివేకానందపై పాశవికంగా, అసభ్య పదజాలంతో దూషించిన టీడీపీ న్యాయవాదులు న్యాయవాద వృత్తికే కళంకం తీసుకువచ్చారని విమర్శించారు. ఏసీబీ న్యాయమూర్తి ఒక మహిళ అనే కనీస గౌరవం కూడా లేకుండా టీడీపీ న్యాయవాదులు కోర్టులో విధ్వంసకర పరిస్థితులు కల్పించడం న్యాయవ్యవస్థకే మచ్చగా పరిగణించారు. ఏసీబీ కోర్టులో జరిగిన పరిణామాల్ని సుప్రీంకోర్టు, హైకోర్టు సీజే దృష్టికి తీసుకువెళ్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ లీగల్‌సెల్ న్యాయవాదులు అబ్రహం కెనడీ, విఠల్‌రావు, సౌమ్య, మన్మథరావు, నిర్మలత, ఒగ్గు గవాస్కర్, వెంకటేశ్వరశర్మ తదితరులు పాల్గొన్నారు.

నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలి



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న డాక్టర్ సమరం

మధురానగర్(విజయవాడసెంట్రల్): విద్యార్థులు నాయకత్వ లక్షణాలను పెంపొందించుకుని లక్ష్యాలు చేరుకోవాలని డాక్టర్ జి.సమరం సూచించారు. మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఫ్రెషర్స్ డే జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కాలానుగుణంగా నైపుణ్యం మెరుగుపరచుకోవాలన్నారు. విద్యార్థులు విద్యతో పాటు సామాజిక స్పృహను పెంపొందించుకోవాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి మాట్లాడుతూ క్రమశిక్షణతో విద్య నేర్చుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులతో మానవీయ విలువలు, తోటి విద్యార్థులతో స్నేహంగా ఉంటూ సమాజాన్ని, ప్రకృతిని, దేశాన్ని గౌరవిస్తూ ఉంటామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకుడు డాక్టర్ డి.బాలసుబ్రహ్మణ్యం, కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

నగర ప్రముఖులకు దసరా ఆహ్వాన పత్రికలు



ఆహ్వాన పత్రికను అందజేస్తున్న దుర్గగుడి కమిటీ చైర్మన్ రాంబాబు, ఈవో రామారావు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీ దుర్గా మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానంలో ఆదివారం నుంచి ప్రారంభమయ్యే దసరా ఉత్సవాలకు విచ్చేయాల్సిందిగా శుక్రవారం నగరానికి చెందిన పలువురు ప్రముఖులకు ఆహ్వాన పత్రికలను అందజేశారు. మేయర్ రాయన భాగ్యలక్ష్మి, పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు దంపతులు, ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా, తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్‌ను కలిసిన దుర్గగుడి చైర్మన్ కర్నాటి రాంబాబు, ఈవో కె.ఎస్.రామారావు, ఆలయ పాలక మండలి సభ్యులు బుద్దా రాంబాబు, కట్టా సత్తెయ్య, వైదిక కమిటీ సభ్యులు శంకర శాండిల్యలు ఆహ్వాన పత్రికలను అందజేశారు.

కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



హోమంలో ఎమ్మెల్యే మల్లాది విష్ణు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): పరమశివునికి ప్రీతిపాత్రమైన మాస శివరాత్రిని పురస్కరించుకుని శుక్రవారం గవర్నర్‌పేటలోని శ్రీ కాశీ విశ్వేశ్వర అన్నపూర్ణ దేవస్థానంలో ఎమ్మెల్యే మల్లాది విష్ణు ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవస్థానంలో నిర్వహించిన సర్వదేవతా హోమాలు, పూర్ణాహుతిలో సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణంలోని విఘ్నాధిపతికి ఆది పూజ నిర్వహించారు. అనంతరం రుద్రాభిషేకం జరిగింది.

ఎస్ఆర్ శంకరన్ జయంతి, వర్ధంతిని ప్రభుత్వమే నిర్వహించాలి

సజ్జలకు వినతిపత్రం అందజేసిన శంకరన్ మెమోరియల్ కమిటీ



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఎస్ఆర్ శంకరన్ జయంతి, వర్ధంతి కార్యక్రమాలు ప్రభుత్వమే నిర్వహించాలని ఎస్ఆర్ శంకరన్ మెమోరియల్ కమిటీ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. కమిటీ కన్వీనర్, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్‌తోపాటు కమిటీ ప్రతినిధులు శుక్రవారం ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డిని ఆయన కార్యాలయంలో కలిసి వినతి పత్రం సమర్పించారు. సజ్జల రామకృష్ణారెడ్డిని కలిసిన అనంతరం కమిటీ కన్వీనర్ విల్సన్ మాట్లాడుతూ ఎస్ఆర్ శంకరన్ పేదల అభ్యున్నతికి జీవితాన్ని త్యాగం చేశారన్నారు. ఈ నెల 22న మహనీయుడు శంకరన్ జయంతి కార్యక్రమం ఉందని, ప్రభుత్వం స్పందించాలని కోరారు. సజ్జల రామకృష్ణారెడ్డిని కలిసిన వారిలో కమిటీ ప్రతినిధులు సీహెచ్ కోటేశ్వరరావు, డీహెచ్‌పీఎస్ ప్రధాన కార్యదర్శి కరవది సుబ్బారావు, బుట్టి రాయప్ప, కోట కళ్యాణ్, క్రాంతి కుమార్, అన్నవరపు నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పాయకాపురం(విజయవాడరూరల్): పాయకాపురం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో 11 కేవీ కండ్రిక, రాధానగర్, శాంతినగర్, పాయకాపురం, ఉడాకాలనీ ఫీడర్‌లో విద్యుత్ లైన్ల మరమ్మతులు జరుగుతున్నందున శనివారం పలు ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి 10గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తారని విద్యుత్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు బీవీ సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. నూజివీడు మెయిన్‌రోడ్డు, బర్మాకాలనీ, ఓల్డ్ పాయకాపురం, 4 పోల్ సెంటర్, ప్రజాశక్తి నగర్, రాధానగర్, డాక్టర్స్ కాలనీ, విశాలాంధ్ర కాలనీ, ప్రశాంతి నగర్, పాకిస్తాన్ కాలనీ, ప్రకాష్‌నగర్, ఎల్‌బీఎస్ నగర్, పటేల్ నగర్, సుందరయ్య నగర్, ఏపీఎస్ రెడ్డి రోడ్డు, న్యూ రాజీవ్‌నగర్, వాటర్ ట్యాంక్ మెయిన్‌రోడ్డు, ఓల్డ్ రాజీవ్‌నగర్, ప్రకాష్‌నగర్ మెయిన్‌రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదు.

డయల్ యువర్ సీపీకి 11 ఫిర్యాదులు



సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): పోలీస్ కమిషనరేట్‌లో శుక్రవారం నిర్వహించిన డయల్ యువర్ పోలీస్ కమిషనర్ కార్యక్రమంలో సీపీ టీకే రాణా నేరుగా 11 మంది బాధితులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. దీనికి పోలీస్ కమిషనర్ కార్యాలయంలో కేటాయించిన 0866-2490613 నంబర్‌కు ప్రజలు తమ సమస్యలను నేరుగా పోలీస్ కమిషనర్‌కు తెలిపారు. వీటిలో ట్రాఫిక్ సమస్యలు, అసాంఘిక శక్తులపై, కుటుంబ కలహాలు, ఆర్థిక నేరాలు, స్థలం తగాదాలు ఉన్నాయి. దీనిపై సీపీ సంబంధిత పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓలు, ట్రాఫిక్ అధికారులతో మాట్లాడి ఆయా సమస్యలను చట్టపరిధిలో పరిష్కరించాలని ఆదేశించారు.


వైద్య రంగంలో డిజిటల్ టెక్నాలజీది ప్రముఖ పాత్ర

లబ్బీపేట(విజయవాడతూర్పు): వైద్య రంగంలో డిజిటల్ టెక్నాలజీది ప్రముఖ పాత్ర అని బీఐఎస్ఐ విజయవాడ బ్రాంచ్ సీనియర్ డైరెక్టర్ వినోద్ అన్నారు. ప్రపంచ ప్రమాణాల దినోత్సవం -2023 సందర్భంగా బీఐఎస్(బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్) ఆధ్వర్యంలో శుక్రవారం ఎ షేర్డ్ విజన్ ఫర్ ఎ బెటర్ వరల్డ్-గుడ్ ఎస్డీజీ3-గుడ్ హెల్త్ అండ్ వెల్ బీయింగ్ అనే నినాదంతో మనక్ మహోత్సవ్ నిర్వహించారు. ఎంజీ రోడ్డులోని ఓ హోటల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో వినోద్ మాట్లాడుతూ ప్రామాణిక రంగంలో ప్రపంచంలో నిపుణుల సహకారాన్ని స్మరించుకోవడానికి ప్రపంచ ప్రమాణాల దినోత్సవం జరుపుకుంటామన్నారు. కార్యక్రమంలో బీఐఎస్ జాయింట్ డైరెక్టర్లు సుజాత, రమాకాంత్ సాగర్, మంగళగిరిలోని ఎయిమ్స్ డైరెక్టర్ ముఖేష్ త్రిపాఠిలు టెక్నికల్ ప్రజెంటేషన్ చేశారు. డాక్టర్ జి. మోహన్ రోవా, డాక్టర్ బి. చంద్ర శేఖర్, సాయి కుమార్ వేదులు పాల్గొన్నారు. పలువురు ప్రతినిధులు ప్రతినిధులు, పెనమలూరు, విజయవాడ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు 120 మంది పాల్గొన్నారు.

'మధురానగర్‌ను' శాటిలైట్ స్టేషన్‌గా అభివృద్ధి చేయాలి


మధురానగర్(విజయవాడసెంట్రల్): నగరంలోని రెండో రైల్వేస్టేషన్ 'మధురానగర్'ను శాటిలైట్ స్టేషన్‌గా అభివృద్ధి చేసి ఎక్స్‌ప్రెస్ రైళ్లకు మధురానగర్‌లో హాల్ట్ ఇవ్వాలని మాజీ కార్పొరేటర్ పిల్లి లక్ష్మీతులసి శుక్రవారం రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ సీహెచ్ రాకేష్‌కు వినతిపత్రం అందజేశారు. సికింద్రాబాద్ రైల్వే నిలయంలో సౌత్ సెంట్రల్ రైల్వే జనరల్ మేనేజర్ కార్యాలయంలో జీఎం అత్యవసర సమావేశంలో ఉండటంతో ఆయన సూచనలపై చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఆమె మాట్లాడుతూ మెయిన్ రైల్వేస్టేషన్ ఆసియాలోనే అతిపెద్ద రైల్వేజంక్షన్‌గా ఉందని, స్టేషన్‌లోని అన్ని ప్లాట్‌ఫాంలు నిత్యం రద్దీగా ఉంటున్నాయన్నారు. దీంతో మహిళలు, వృద్ధులు, చిన్నారులు రైలు అనౌన్స్‌మెంట్ కాగానే లగేజీలతో వెళ్లడం ఇబ్బందిగా మారిందన్నారు. మధురానగర్ రైల్వేస్టేషన్ మీదుగా వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైళ్లకు మధురానగర్‌లో హాల్ట్ ఇవ్వడంతో కొంతమేర రద్దీని తగ్గించే అవకాశం ఉందని వినతి పత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏపీ ఎన్జీఓ నేత పీవీఎల్ఎన్ రాజు పాల్గొన్నారు.

చదువుపై శ్రద్ధ చూపాలి



పాయకాపురం(విజయవాడరూరల్): పిల్లల చదువుల విషయంలో తల్లిదండ్రులు శ్రద్ధ తీసుకోవాలని 62వ డివిజన్ కార్పొరేటర్ అలంపూరు విజయలక్ష్మి సూచించారు. శుక్రవారం పుచ్చలపల్లి సుందరయ్య మునిసిపల్ హైస్కూల్‌లో పేరెంట్స్ సమావేశం జరిగింది. కార్పొరేటర్ విజయలక్ష్మి మాట్లాడుతూ పిల్లలను బడికి పంపడంతో పాటు వారు హైస్కూల్‌కు వెళ్లి ఎలా చదువుతున్నారనే విషయాన్ని ఉపాధ్యాయులను అడిగి తెలుసుకోవాలన్నారు. సమావేశంలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు ఎం.హుస్సేన్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రోజూ గుడ్డు తినాలి



మధురానగర్(విజయవాడసెంట్రల్): ప్రతి రోజూ గుడ్డు తింటే ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని 30వ డివిజన్ కార్పొరేటర్ బీహెచ్ ఎస్‌పీ జానారెడ్డి అన్నారు. అయోధ్యనగర్‌లో జయహో వాకర్స్‌క్లబ్ ఆధ్వర్యాన జాతీయ ఎగ్‌డే సందర్భంగా గుడ్ల పంపిణీ చేశారు. కార్యక్రమంలో వాకర్స్‌క్లబ్ అధ్యక్షురాలు కొల్లా జయశ్రీతో కలిసి కోడిగుడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు ఆంజనేయరాజు తదితరులు పాల్గొన్నారు.

నగరాభివృద్ధికి కృషి చేస్తాం



స్థాయీ సంఘం సమావేశం

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో వీఎంసీ పాలకపక్షంగా కృషి చేస్తున్నామని వీఎంసీ మేయర్ రాయన భాగ్యలక్ష్మి అన్నారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూంలో శుక్రవారం జరిగిన స్థాయీ సంఘం సమావేశంలో సభ్యులు పలు ప్రతిపాదనలపై ఆమోదం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నగరంలో వైఎస్సార్ సీపీ పాలక పక్షం అధికారం చేపట్టిన తర్వాత శరవేగంగా అభివృద్ధి చెందుతోందని, అన్ని డివిజన్లలో మౌలిక సదుపాయాలు కల్పించడానికి తాము ప్రణాళిక రూపొందిస్తున్నామని ఆమె పేర్కొన్నారు. స్థాయిసంఘం అజండాలో మొత్తం 30 అంశాలు రాగా అందులో 28 ఆమోదించగా ఒక అంశం రికార్డు, ఒక అంశం ధ్రువీకరణ జరిగింది.

ప్రధానాంశాలు

- హనుమాన్‌పేటలోని వీఎంసీ ఆధ్వర్యంలో రూట్స్ సంస్థ నిర్వహించే నైట్ షెల్టర్ కాలపరిమితి ముగియడంతో మరో ఐదేళ్లు పొడిగింపునకు ప్రతిపాదన రాగా స్థాయీసంఘం సభ్యులు ఆమోదం తెలిపారు.
- వీఎంసీ ప్రధాన కార్యాలయ ప్రాంగణంలో నూతనంగా నిర్మిస్తున్న భవనంలోని మూడో ఫ్లోర్‌లో మౌలిక వసతుల కల్పనకు అయ్యే రూ.49 లక్షలను కార్పొరేషన్ జనరల్ ఫండ్స్ నుంచి నిధులు వెచ్చించాలని వచ్చిన ప్రతిపాదనపై సభ్యులు ఆమోదం తెలిపారు.
- వీఎంసీ పరిధిలోని ఆయా ప్రాంతాల్లో విధులు నిర్వహించే 16మంది కమ్యూనిటీ ఆర్గనైజర్లకు 11వ పీఆర్సీ ప్రకారం ప్రస్తుత బేసిక్స్‌పై 23శాతం ఫిట్‌మెంట్ పెంపుదల ఇవ్వడానికి వచ్చిన ప్రతిపాదనపై సభ్యులు ఆమోదం తెలిపారు.

ప్రతి ఇంటా సంక్షేమ కాంతులు



32వ డివిజన్‌లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే మల్లాది విష్ణు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ప్రతి ఇల్లూ సంక్షేమ కాంతులతో కళకళలాడుతోందని సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. 32వ డివిజన్ 231వ వార్డు సచివాలయ పరిధిలో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, కో ఆప్షన్ సభ్యురాలు గుండె సుభాషిణితో కలిసి రామలింగేశ్వరపేటలో గడప గడపకు వెళ్లి స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించారు.

రూ. 7 కోట్లతో అభివృద్ధి పనులు

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక డివిజన్‌లో రూ. 7 కోట్ల అంచనాలతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు మల్లాది విష్ణు తెలిపారు. గత ప్రభుత్వంలో ఎటు చూసినా సమస్యలే ఎక్కువగా కనపడేవని.. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పరిస్థితి పూర్తిగా మారిపోయినట్లు వెల్లడించారు. 2019కి ముందు చిన్నపాటి వర్షానికి కూడా రోడ్లన్నీ జలమయమయ్యేవని గుర్తుచేశారు. నేడు ఈ ప్రాంత రూపురేఖలే మారిపోయాయని చెప్పారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పాటు అయ్యాక.. లోటస్ సెక్టార్‌లో రూ. 6 కోట్ల మేర అభివృద్ధి పనులు చేపట్టినట్లు మల్లాది విష్ణు తెలిపారు. రూ. 40 లక్షలతో అర్చి రోడ్డును, రూ.15.35 లక్షలతో శానిటరీ కార్యాలయాన్ని ఇటీవల ప్రారంభించుకున్నట్లు గుర్తు చేశారు. బసవతారకనగర్‌లో రూ. 18 లక్షల నిధులతో తొమ్మిది రోడ్లు నిర్మించుకుంటున్నట్లు వెల్లడించారు. గత ప్రభుత్వం చేతగాక వదిలేసిన ఎస్సీ కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణాన్ని.. ఈ ప్రభుత్వం బాధ్యతగా తీసుకుని రూ. 17 లక్షలతో పూర్తి చేస్తున్నట్లు వెల్లడించారు. అయోధ్యనగర్ అర్బన్ హెల్త్ సెంటర్.. రోగులకు మెరుగైన వైద్య సేవలను అందిస్తోందని ఎమ్మెల్యే చెప్పారు.

అవినీతికి కేరాఫ్ చంద్రబాబు

అవినీతికి కేరాఫ్ చంద్రబాబు అని ఆయనతో రాష్ట్ర ప్రజలకు జరిగిన మంచి ఒక్కటీ లేదని ఎమ్మెల్యే మల్లాది విష్ణు విమర్శించారు. కానీ ఈ ప్రభుత్వంలో గడప గడపకు మన ప్రభుత్వం, మా నమ్మకం నువ్వే జగన్, జగనన్న ఆరోగ్య సురక్ష వంటి కార్యక్రమాలతో ప్రజలకు అనేక రకాలుగా మేలు చేకూరుతోందన్నారు. దీంతో ఈ ప్రభుత్వానికి ప్రజల్లో ఆదరణ విపరీతంగా పెరుగుతోందని తెలిపారు. ఎంత మంది కలసి వచ్చినా వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయాన్ని ఎవరూ ఆపలేరని ధీమా చేశారు. కార్యక్రమంలో వీఎంసీ అధికారులు, వైఎస్సార్ సీపీ నాయకులు, వార్డు సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

యువత సమయాన్ని వినియోగించుకోవాలి

అంతర్ కళాశాలల సాంస్కృతిక ఉత్సవాల ముగింపు సభలో అరుణ్‌కుమార్



ఓవరాల్ చాంపియన్ షిప్ సొంతం చేసుకున్న సిద్ధార్థ విద్యార్థులతో చుక్కపల్లి అరుణ్‌కుమార్

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): సమయాన్ని పూర్తి స్థాయిలో వినియోగించుకుంటేనే యువత లక్ష్యాలు సాధించగలరని సిద్ధార్థ కళాశాల కన్వీనర్ చుక్కపల్లి అరుణ్‌కుమార్ చెప్పారు. కేవీఎస్ఆర్ సిద్ధార్థ ఫార్మసీ కళాశాల, సేఫ్ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో సిద్ధార్థ ఆడిటోరియంలో జరుగుతున్న అంతర్ కళాశాలల సాంస్కృతికోత్సవాలు శుక్రవారం సాయంత్రం ముగిశాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవితంలో విద్యార్థి దశ చాలా కీలకమన్నారు. దీన్ని ఎంజాయ్ చేస్తూనే అనుకున్న లక్ష్యాలను చేరువ కావడానికి ఏమి చేయాలనే అంశాలపై దృష్టి పెట్టాలని చెప్పారు. చదువుతో పాటు ఆరోగ్యంపై యువత దృష్టి పెట్టాలన్నారు. సిద్ధార్థ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ సునీత, సేఫ్ సంస్థ అధ్యక్షురాలు జోత్స్నతో పాటు వివిధ కళాశాలల విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు. మహిళల సాధికారత, భద్రత అనే అంశాలపై విద్యార్థులకు స్కిట్, మైమ్, డిబేట్‌తో పాటుగా ఫ్లాష్‌మాబ్ పోటీలను నిర్వహించారు.విజేతలకు అరుణ్‌కుమార్ బహుమతులను అందజేశారు. రెండు రోజులపాటు జరిగిన పోటీల్లో పీబీ సిద్ధార్థ కళాశాల ఓవరాల్ చాంపియన్ షిప్‌ను సొంతం చేసుకుంది.